క్లుప్తంగా

గవర్నర్‌తో ఏయూ వీసీ భేటీ



ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ బుధవారం రాజ్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ అభివృద్ధి, శతాబ్ది ఉత్సవాల నిర్వహణ విషయాలను గవర్నర్‌కు వివరించారు. అదేవిధంగా 91వ, 92వ స్నాతకోత్సవాల నిర్వహణపై కూడా గవర్నర్‌తో వీసీ చర్చించారు.

– సాక్షి, విశాఖపట్నం

శివాజీపాలెంలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు ముువ్వల సురేష్, పీతల గోవింద్

మద్దిలపాలెం : శివాజీపాలెంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముువ్వల సురేష్, 22వ వార్డు పార్టీ అధ్యక్షుడు పీతల గోవింద్, 20వ వార్డు అధ్యక్షుడు యనమరెడ్డి కుమార్ రెడ్డి భక్తులకు ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, హెచ్‌డీపీపీ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ : టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 22న నిర్వహించనున్న ఉచిత సామూహిక శ్రీ వరలక్ష్మి అమ్మవారి వ్రతం పోస్టర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు బుధవారం ఎంవీపీ కాలనీలో ఆవిష్కరించారు. అనంతరం హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) క్లస్టర్ సూపరింటెండెంట్ ఎం.కాంతికుమార్ వివరాలు వెల్లడించారు. 22న రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 9 గంటలకు వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే వెయ్యి మంది భక్తులకు ఉచిత కూపన్లు అందజేశామని తెలిపారు. వారంతా వ్రతం ప్రారంభానికి ముందుగా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు హెచ్‌డీపీపీ ప్రతినిధులు, అధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌లో హెల్త్‌సిటీ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని ఇసుకతోటకు చెందిన బోయి రమణ ద్విచక్ర వాహనంపై దారపాలెంలోని బంధువుల గృహ ప్రవేశ కార్యక్రమానికి వెళ్తున్నాడు. హెల్త్‌సిటీ దాటిన తర్వాత దీన్‌దయాల్‌పురం కూడలి సమీపంలో ఎదురుగా రాంగ్ రూటులో వస్తున్న ఓ కారు రమణ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కిందపడిన రమణ కాలు పాదానికి తీవ్ర గాయమై బొటన వేలు తెగి పడిపోయింది. తలకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గాయాల పాలైన రమణ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

యువకుడి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు : ఓ యువకుడు విషం తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడకు చెందిన తమ్మినేని కౌశిక్ (22) ఏయూలో బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ నెల 10న మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక లాడ్జిలో దిగాడు. అమెరికాలో ఉన్న కౌశిక్ అన్నయ్య బుధవారం ఉదయం ఫోన్ చేసినప్పటికీ కౌశిక్ తీయకపోవడంతో అతను స్నేహితులను లాడ్జికి వెళ్లమని చెప్పాడు. వారు వెళ్లి చూసేసరికి కౌశిక్ విగతజీవిగా పడి ఉన్నాడు. ఘటనా స్థలంలో విషం ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం మాయం



గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో మద్యం సీసాలు



పిఠాపురం కాలనీలో చెత్తతో అస్తవ్యస్తంగా గ్రీన్‌బెల్ట్ ప్రాంతం

- జాతీయ రహదారిని అనుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి
- గతంలో చెట్లు తొలగించకుండా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దిన పాలకులు
- కూటమి ప్రభుత్వంలో నిర్వహణ లేక పచ్చదనం మాయం
- ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం

మద్దిలపాలెం :

జాతీయ రహదారికి ఇరువైపులా విస్తరించి ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతం పచ్చదనంతో నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పచ్చని మొక్కలను పరిరక్షించి, అభివృద్ధి చేసి ఆహ్లాదంగా మార్చింది. నియోజకవర్గం పరిధిలో ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలోని చెట్లు తొలగించకుండా పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, జిమ్‌లు, ఫ్లవర్ గార్డెన్‌తో అందంగా, ప్రజలు సేద తీరేందుకు అనువుగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రీన్‌బెల్ట్ ప్రాంతం నిర్లక్ష్యానికి గురవుతోంది. గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చెట్లను ఒక్కొక్కటిగా నరికి ఆ ప్రాంతాన్ని చదును చేసేసి ఆట స్థలాలుగా మార్చివేస్తున్నారు. ఆకతాయిలు, మందుబాబుల అడ్డాగా మారిపోతోంది. మద్దిలపాలెం కూడలికి సమీపంలోని సీఎంఆర్ సెంటర్ వద్ద ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని చదును చేసేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేసుకున్నారు. ఇక్కడ కూర్చునేందుకు సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు. దాని పక్కనే ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చెట్ల కొమ్మలు ఒక్కొక్కటిగా నరికి వాటిని తగల బెట్టేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని కూడా ఆటస్థలంగా మార్చేందుకు ప్రయతిస్తున్నారు. అయినప్పటికీ ఇటువైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం విశేషం.



మద్దిలపాలెం కూడలిలో సీఎంఆర్ సెంట్రల్ వద్ద పచ్చదనం మాయమైన గ్రీన్‌బెల్ట్ ప్రాంతం

పిఠాపురంకాలనీలో అస్తవ్యస్తం

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో గల గ్రీన్ బెల్ట్ చెత్త, వ్యర్థాలతో కళావిహీనంగా మారింది. వాకింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్ మాయమైపోయింది. గ్రీన్‌బెల్ట్ పరిసరాలు అధ్వానంగా అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో చీకటి పడితే చాలు మందుబాబులు అక్కడకు చేరి పెచ్చు మీరిపోతున్నారు. దీని పక్కనే ఉన్న ప్రాంతం పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో వారి ఆగడాలు పెరిగిపోతున్నాయి.

పట్టించుకోని హార్టికల్చర్ విభాగం

నగరంలో పచ్చదనం పరిరక్షణ, అభివృద్ధిని పర్యవేక్షించాల్సిన హార్టికల్చర్ విభాగం పర్యవేక్షణ కొరవడింది. జాతీయ రహదారిని అనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లో పచ్చదనం మాయమవుతున్నా, చెట్లు నరికి తగలబెట్టి చదును చేసి ఆట స్థలాలుగా మారుస్తున్నా అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా హార్టికల్చర్ విభాగం అధికారులు మేల్కొని గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో పచ్చదనం పరిరక్షణ, అభివృద్ధికి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వర్షాకాలమైనా నీరు లేని కొలను

- జూలోని మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు

ఆరిలోవ : వర్షాకాలంలోనూ నీటి కొలనులు ఎండిపోతున్నాయి. ఇటీవల తీవ్ర ఎండలకు కొలనుల్లో నీరు ఆవిరైపోవడంతోపాటు భూగర్భ జలాలు సైతం ఇంకిపోయాయి. ఈ నేపథ్యంలో ఇందిరా గాంధీ జూ పార్కు మధ్యలో ఉన్న సరోవర కొలను పూర్తిగా ఎండిపోయింది. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొద్దిపాటి మట్టితో కూడిన నీరు చేరింది. సాధారణంగా వర్షాకాలంలో కురిసిన వానలకు ఆగస్టులోనే ఈ కొలను నిండిపోయేది. ఈ ఏడాది మాత్రం ఇంతవరకు ఇందులో నీరు లేకుండా పోయింది. జూ లోపల కొండలపై బాహ్య ప్రపంచంలో సంచరించే జింకలు, కనుజులు, అడవి పందులు, ముళ్ల పందులకు ఈ కొలను దాహం తీర్చేది. ఆయా వన్యప్రాణులు మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో ఈ కొలనులో నీరు తాగడానికి వస్తూ సందర్శకులను కనువిందు చేస్తుంటాయి.

ప్రస్తుతం దీనిలో నీరు లేకపోవడంతో ఆయా వన్యప్రాణులు నీటి కోసం కటకటలాడుతున్నాయి. దీంతో ఇవి సాగర్‌నగర్ బీచ్ రోడ్డువైపు, ఎండాడ జాతీయ రహదారి వైపు నీటి కోసం వెళ్తూ వాహనాలకు అడ్డంపడి ప్రమాదాలకు గురవుతున్నాయి. నీటి ఎద్దడి మనుషులతోపాటు వన్యప్రాణులను కూడా వదలడం లేదు. జూ కొండల్లో ఉండే మూగ జీవాలు ఈ కొలను ఎప్పుడు నిండుతుందోనని ఎదురు చూస్తున్నాయి.



ఇటీవల చేరిన కొద్దిపాటి నీటితో జూ కొలను

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

విశాఖ విద్య : విద్యార్థులు చదువుతోపాటు సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు సూచించారు. వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ విద్యార్థులు బమ్మిడి రజిని, వనం కళ్యాణ్ యూనివర్సిటీ లెవెల్ బెస్ట్ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్స్‌గా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసింహారావు, విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి బోరుగడ్డ సుబ్బయ్య అవార్డు అందుకున్న వలంటీర్స్‌ను అభినందించి సన్మానించారు. ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజ్‌కు అవార్డులు రావడం చాలా సంతోషకరమన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అంటేనే సేవా భావంతో ఉంటారని తెలియజేశారు. ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను ప్రారంభించిన తర్వాత యూనివర్సిటీలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, వీరికి అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రోగ్రాం అధికారి బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ అవార్డు అందుకున్న విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే అడ్వెంచర్ క్యాంప్, కల్చరల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ వంటి వివిధ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారన్నారు. వారికి అవార్డులు రావడం కాలేజీకి గర్వకారణమన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆచార్య నరసింహారావు

నాలుగో రోజూ లభించని ఆచూకీ

ఎంవీపీ కాలనీ : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ సముద్రంలో కొట్టుకుపోయిన జాలరి ఎండాడకు చెందిన పిల్లా సతీష్ (24) అనే యువకుడి ఆచూకీ నాలుగో రోజూ లభించలేదు. ఆదివారం ఉదయం సతీష్ గేలం ద్వారా లాసన్స్ బే కాలనీ సముద్ర తీరంలో చేపలు పడుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. వర్షం సమయంలో చేపలు విరివిగా దొరకుతాయనే ఆశతో గెడ్డ వద్ద నిల్చుని వేట సాగిస్తూ అనుకోకుండా ప్రమాదానికి గురయ్యాడు. అక్కడే ఉన్న కొందరు గమనించి కొంతసేపటికి ఈదుకుంటూ వచ్చేస్తాడని ఆశించారు. అయితే ఎంతసేపటికీ సతీష్ జాడ లేకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కలిసి పోలీసులకు, జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించారు. అయినప్పటికీ వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో కుటుంబ సభ్యులే సొంత ఖర్చులతో గత నాలుగు రోజులుగా బోట్లు పెట్టుకుని వెతుకుతున్నారు. అయితే సతీష్ సముద్రంలో కొట్టుకుపోయి నాలుగు రోజులు అవుతున్నా మృతదేహం ఆచూకీ లభించకపోవడంతో మత్స్యకార గ్రామాల్లో విషాదాన్ని నింపుతోంది. జిల్లా యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ చూపి సతీష్ మృతదేహం అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు



సతీష్ ఆచూకీ కోసం తీరంలో ఎదురు చూస్తున్న జాలరి ఎండాడ మత్స్యకారులు

దగాకోరు చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు



మహిళకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

- వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : మోసపూరిత హామీలతో పాలన సాగిస్తున్న చంద్రబాబునాయుడుకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 23వ వార్డులోని మద్దిలపాలెం సమీప 246వ నంబరు బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు ప్రతీ గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయించడమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. ఇది చాలా దురదృష్టకరమని, ఈ కూటమి ప్రభుత్వం గద్దె దిగేవరకు మోసపోయిన ప్రతి ఒక్కరిలో చైతన్యం నింపేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వార్డు పరిశీలకులు బోర కుమార్ రెడ్డి, బూస రమణరెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, ఎంగ్రెడ్ల ఈశ్వర్ రెడ్డి, పులగం శ్రీనివాస రెడ్డి, బోర రామిరెడ్డి, పిలక మధుసూదన రెడ్డి, గుడ్ల నర్సింగరావు రెడ్డి, బోస రమణ రెడ్డి, సాడి లక్ష్మణ రెడ్డి, బోయి త్రినాథ్ రెడ్డి, ముదిలి శ్రీను, చిల్లా నారాయణరావు రెడ్డి, పిడింట్ల నర్సింగ్ రెడ్డి, ఎరుసు అరుణ, గుడ్ల త్రినాథ రెడ్డి, కారపురెడ్డి దుర్గా శ్రీనివాస్, అవ్వ నర్సింగరావు, పుట్ట రమణమ్మ, గుమ్మడి మణి, సాల చిన్ని, పద్మ, బూర సూరమ్మ, సీరపు రామలక్ష్మి, బోయి శ్రీనురెడ్డి, బోయి రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని కుమారుడి చెంతకు చేర్చిన పోలీసులు

విశాఖ సిటీ : నగరంలో వర్షంలో తడుస్తూ దయనీయ స్థితిలో ఉన్న వృద్ధుడిని పోలీసులు గుర్తించి ఛత్తీస్‌గఢ్‌లో ఉంటున్న అతని కుమారుడికి అప్పగించారు. ఈ నెల 16న శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి నగరంలో పర్యటిస్తున్న సమయంలో సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో వర్షంలో తడుస్తూ ఒక వృద్ధుడు కనిపించాడు. వెంటనే సీపీ ఆ వ్యక్తిని ఎస్కార్ట్ వాహనంలో అక్కడి నుంచి పెదవాల్తేరులో ఉన్న జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ షెల్టర్‌కు తరలించారు. సదరు వృద్ధుడిని జ్యోతిర్గమయ కార్యక్రమంలో భాగం చేసి, ఆశ్రయం కల్పించారు. అతని కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీయాలని సీపీ సిబ్బందిని ఆదేశించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది వృద్ధుడికి సపర్యలు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తన పేరు రామ్ బగాస్ (87) అని, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ సమీపంలో సత్నమి గ్రామంలో నివాసముంటున్నట్లు చెప్పాడు. దీంతో బగాస్ కుమారుడు రతన్ రామ్ బగాస్‌కు రెడ్‌క్రాస్ సిబ్బంది సమాచారం అందించి విశాఖకు రప్పించి బుధవారం తండ్రిని అప్పగించారు. మతిస్థిమితం కోల్పోయి దూరమై నాలుగు నెలలవడంతో తండ్రిని తిరిగి కలుసుకుంటామని అనుకోలేదని, తన తండ్రిని గుర్తించి, తమకు అప్పగించిన సీపీ శంఖబ్రత బాగ్చికి ధన్యవాదాలు తెలిపారు.



తండ్రిని కుమారుడికి అప్పగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, తదితరులు

విమ్స్‌లో ఫిజియోథెరపీ కేంద్రం వెలవెల

- మెరుగైన సేవలు అందించని వైద్య సిబ్బంది
- అసంతృప్తితో ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్న రోగులు
- విమ్స్‌లో నిరుపయోగంగా లక్షలాది రూపాయల పరికరాలు



రోగులు లేక ఖాళీగా ఉన్న పరికరాలు



ఫిజియోథెరపీ విభాగం సీఎంవో చాంబర్‌లో నిద్రపోతున్న వైద్యాధికారిణి



విలువైన పరికరాలతో ఫిజియోథెరపీ హాల్

ఆరిలోవ : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో రీహేబిటేషన్ సెంటర్ పేరుతో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ విభాగం వెలవెలబోతోంది. ఈ విభాగంలో లక్షలాది రూపాయల విలువ చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విమ్స్‌లో ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ సేవలు బాగా అందుతాయని రోగులు గతంలో సంతృప్తి వ్యక్తం చేసేవారు. అందుబాటులో ఉన్న పరికరాలను ఉపయోగించి ఇక్కడి వైద్య సిబ్బంది రోగులకు సేవలు అందించేవారు. దీంతో రోజూ ఓపీ 50 నుంచి 60 వరకు ఉండేది. ప్రస్తుతం దీని ఓపీ రెండంకెల సంఖ్య దాటడం కష్టమవుతోంది. ఈ విభాగంలో కొన్నాళ్లుగా సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ వైద్య సిబ్బంది సరైన సేవలు అందించడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో సుమారు ఆరు నెలలుగా ఈ విభాగం బోసిపోయింది. ప్రస్తుతం రోజులో ఇక్కడకు వెళ్తున్న వారి ఓపీ 10 నుంచి 15 మధ్యలోనే ఉంటుందని సిబ్బంది చెబుతున్నారు. దీంతో ఇక్కడి పరికరాలు ఖాళీ అయిపోయాయి.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే...

విమ్స్‌లోని ఆర్థోపెడిక్ వైద్యులు ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచిస్తే సంబంధిత రోగులు ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. అక్కడ వందలాది రూపాయలు ఫీజు చెల్లించుకుంటున్నారు. సాధారణంగా ఆర్థోపెడిక్ విభాగానికి ఇక్కడ ఓపీ ఎక్కువగా ఉంటుంది. వారిలో సుమారు 70 శాతం మందికి వైద్యులు ఫిజియోథెరపీ చేయించుకోవాలని సూచిస్తున్నారు. అందుకు అనుగుణంగా విమ్స్‌లోనే ఫిజియోథెరపీ అందుబాటులో ఉన్నప్పటికీ వైద్య సిబ్బంది సరైన సేవలు అందించకపోడంతో బయటకు వెళ్లాల్సి వస్తోందని రోగులు అంటున్నారు. ఇదిలా ఉండగా పని ఏమీ లేదు కదా అని బుధవారం ఈ విభాగం సీఎంవో చాంబర్‌లో ఓ వైద్యాధికారిణి కుర్చీలోనే కునుకు తీశారు. ఆ వైద్యురాలి కన్సల్టెన్సీ కోసం వెళ్లిన రోగులు ఆమె నిద్రకు భంగం కలిగించడం ఇష్టం లేక కొంతసేపు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ విభాగంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే సిబ్బంది నిర్లక్ష్యంగా సేవలు అందిస్తున్నారని, అందువల్లే రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రోగులకు మెరుగ్గా ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

‘ఎంఎస్‌ఎంఈ పథకాలను సద్వినియోగం చేసుకోండి’

ఎంవీపీ కాలనీ: వ్యాపారవేత్తలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎంఎస్‌ఎంఈ స్కీమ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం(డీఐసీ) జనరల్ మేనేజర్ ఆదిశేషు కోరారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్, టీమ్ ఇండస్ట్రీస్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంయుక్తంగా ‘అగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్’అంశంపై ఎంవీపీ కాలనీలోని భద్రం పార్క్ వేదికగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతిలో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవసరమైన అన్ని సేవల్ని అందిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి మంది వ్యాపారవేత్తలను తీర్చిదిద్దేలా కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎంఎస్‌ఎంఈ వర్గీకరణ, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలపై సమగ్ర అవగాహన కల్పించారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ అధ్యక్షురాలు, ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ అగ్రో అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో కొత్త వ్యాపార అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీమ్ ఇండస్ట్రీస్ ప్రతినిధి డీఎం రావు, ఎస్ఎస్‌ఐసీ ప్రతినిధి టి.కమలేశ్వరి, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం ఏవీ రమణమూర్తి, గ్లోబల్ అలయన్స్ ఫర్ మాస్ ఎంట్రప్రెన్యూర్షిప్ ప్రతినిధి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐసీ జీఎం ఆదిశేషు



అవగాహన కార్యక్రమానికి హాజరైన పరిశ్రమల ప్రతినిధులు

బాతు ఆకారంలో దొండకాయ



బాలాజీనగర్ మార్కెట్‌లో ఓ కూరగాయల వ్యాపారి వద్ద బాతు ఆకారంలో దొండకాయ

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు పరిధిలోని బాలాజీనగర్‌లో ఒక కూరగాయల వ్యాపారి వద్ద బాతు ఆకారంలో ఉన్న ఒక పెద్ద దొండకాయ ప్రజలను ఆకర్షించింది. బుధవారం కూరగాయల మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు ఆ దొండకాయను చూసి ఆశ్చర్యపోయారు. ఆ దొండకాయకు తల, ముక్కు, పొడవైన మెడ, పొట్ట వంటి భాగాలు బాతును పోలి ఉండటంతో అందరి దృష్టిని ఆకర్షించింది. కూరగాయలు కొనడానికి వచ్చినవారు ఆసక్తిగా దానిని చూశారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు



సత్కరించిన స్కేటర్లు, కోచ్‌లతో అధికారులు, నాయకులు

మద్దిలపాలెం : క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్‌గోపాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, విశాఖ జిల్లా రోలర్ స్కేటింగ్ ఛాంపియన్ సంయుక్త ఆధ్వర్యంలో వారికి తర్ఫీదు ఇచ్చిన కోచ్‌లను కళాభారతి ఆడిటోరియంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గణబాబు, ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తదితరులు స్కేటర్లు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో రోలర్ స్కేటింగ్‌కి విశాఖ చిరునామాగా మారుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎఫ్.ఐ ప్రధాన కార్యదర్శి భగీరథ కుమార్, ఏపీఆర్‌ఎస్‌ఏ అధ్యక్షుడు జె.సుధాకర రెడ్డి, కార్యదర్శి థామస్, వీడీఆర్ఎస్ఏ అధ్యక్షుడు వై.రమేష్ చంద్ర, కార్యదర్శి శీలం లక్ష్మణ్, ఎ.పాల్, కె.కళ్యాణ్, కె.గంగాధర్, కోచ్‌లు పవన్ కుమార్, సత్యనారాయణ, సింహాద్రి, రాజ్ కుమార్, చిట్టిబాబు, నయీం, పతకాలు సాధించిన స్కేటర్లు హరికమల్, అన్విష, సాయి సంహిత, గ్రీష్మ, దినేష్, క్షేత్ర, శంకర్, రుశీల్, కై వల్య, జెస్సీ, చైతన్య, కార్తికేయ, మానేష్, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.